క్లుప్తంగా

నాణ్యమైన విత్తనాలే విక్రయించాలి



విత్తనషాపును ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య

తల్లాడ: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు సరైన ధరలకు విక్రయించాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. శుక్రవారం తల్లాడలో ఏర్పాటు చేసిన సిద్ధి వినాయక విత్తన షాపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. విత్తన డీలర్లు నమ్మకం కలిగేలా ప్రవర్తించాలన్నారు. అనంతరం వెంకటవీరయ్య నూతనకల్, కుర్నవల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాసరావు, కార్యదర్శి వెంకట్‌లాల్, శ్రీనివాసరావు, అశోక్, శ్రీను, లక్ష్మణ్‌రావు, చలపతిరావు, కోటిరెడ్డి, జీవీఆర్ పాల్గొన్నారు.

విచారణ జరిపించాలి

కొణిజర్ల: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో చేపడుతున్న ఎన్‌కౌంటర్‌లపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా నాయకుడు షేక్ ఖాసీమ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కొణిజర్లలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమాయకపు ఆదివాసీలను కూడా మావోయిస్టులని కాల్చి చంపడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సైన్యానికి మద్దతుగా తిరంగా యాత్ర



యాత్రలో పాల్గొన్న ప్రజలు

పెనుబల్లి: పెహల్గాంలో ఉగ్రవాదుల దాడికి ప్రతీకారంగా భారత సైన్యం పాకిస్తాన్ లోని ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేసి, ఉగ్రవాదులను మట్టుపెట్టిన సందర్భంగా మండల కేంద్రంలో తిరంగా యాత్రను నిర్వహించారు. మూడు రోజుల్లోనే పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులను మట్టి కరిపించి మరోసారి విజయంతో భారతదేశ జెండా ఎగరవేసిని భారత త్రివిధ దళాలకు గౌరవ సూచికంగా తిరంగా యాత్రను నిర్వహించారు.

పరామర్శ..



కొమ్మూరి సుశీలమ్మ(ఫైల్)

ఎర్రుపాలెం: మండలంలోని రామాపురం గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు కొమ్మూరి గోపాలరావు తల్లి సుశీలమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు ఫోన్‌లో కుటుంబ సభ్యులతో మాట్లాడి సానుభూతి తెలిపి అండగా ఉంటానన్నారు. సంతాపం తెలిపిన వారిలో డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కవిత, మాజీ సర్పంచ్‌లు అప్పారావు, శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, నాయకులు తదితరులున్నారు.

నివాళి..

తల్లాడ: మండలంలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు, మాజీ నీటి సంఘం అధ్యక్షులు మువ్వా సత్యం(92) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్, పలువురు నాయకులు భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ మండల అధ్యక్షులు కృష్ణమూర్తి, కిరణ్‌కుమార్, శ్రీనివాసరావు, మహేస్ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి దాడి

మధిర: మధిరలోని ఆజాద్ రోడ్డులో బుధవారం గుర్తు తెలియని మతిస్థిమితం లేని వ్యక్తి శుక్రవారం హల్‌చల్ చేశాడు. సదరు వ్యక్తి ఉమామహేశ్వర గల్లీలోని ఓ ఇంట్లోకి చొరబడేందుకు యత్నించాడు. దీంతో స్థానికులు అడ్డుకోగా దాడికి దిగాడు. ఈ ఘటనలో పూసపాటి ఉమామహేశ్వరరావుకు స్వల్ప గాయాలయ్యాయి. చివరకు స్థానికులకు ఆయనకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

నేడు ఇళ్ల పట్టాల పంపిణీ

తల్లాడ: మండలంలోని బిల్లుపాడు క్రాస్‌రోడ్డు ఆర్‌బీ గార్డెన్‌లో శనివారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు అందిచనున్నట్లు తల్లాడ ఎంపీడీఓ సురేష్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో గృహ నిర్మాణ లబ్ధిదారుల, సంబందిత అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

పంట మార్పిడితో లాభాలెన్నో..

- తగ్గనున్న తెగుళ్లు, చీడపీడల బెడద
- నేల భౌతిక స్థితి మెరుగు
- కలుపు సమస్యలకు సైతం చెక్



గత వానాకాలం సీజన్‌లో సాగుచేసిన పత్తి పంట

చింతకాని: వ్యవసాయంలో ఎప్పుడూ ఒకే రకమైన పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు తగ్గుతాయి. చాలా మంది రైతులు ఇప్పటికీ ఒకేరకమైన పంటలు పండిస్తూ సరైన దిగుబడులు రాక ఆర్థికంగా చితికిపోతున్నారు. ఏటా పంట మార్పిడి చేస్తే నాణ్యమైన ఉత్పత్తులు వచ్చి దిగుబడులు రెట్టింపయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

అవగాహన లేకనే..

చాలా మంది రైతులకు సరైన అవగాహన లేక ఏళ్ల తరబడి వేసిన పంటనే వేస్తూ.. నష్టాలన చవిచూస్తున్నారు. పంటమార్పిడి చేస్తే పంట మార్పు మూలంగా నేల భౌతిక స్థితి మెరుగు పడటమే కాకుండా భూమిలో నీరు నిల్వ ఉండే శక్తి కలిగి భూసారం వృద్ధి చెంది చీడపీడలు నాశనమవుతాయి.

చీడపీడలు, తెగుళ్ల బెడద తక్కువ..

ఫలితంగా సస్యరక్షణకు పంటలపై వినియోగించే ఎరువుల ఖర్చు తగ్గటమే కాకుండా శిలీంద్ర వ్యాధులను దూరం చేయవచ్చునని తెలిపారు. బీజాలు, వాటి అవశేషాలు, వానపాముల అభివృద్ధి కూడా ఎక్కువగానే ఉంటుంది. కీటకాల గుడ్లు వృద్ధి చెందకుండా ఉండటంతో పంటలో నాణ్యత పెరిగి దిగుబడి అధికంగా సాధించే అవకాశం ఉందని తెలిపారు.

పాటించాల్సిన సూచనలు..

- జొన్న పంట సాగుచేసిన పొలంలో మిరప పంట సాగుచేయరాదు.
- వేరుశనగ పంటను సాగుచేసిన తర్వాత మళ్లీ అదే పంటను సాగు చేయరాదని, తద్వారా పంటపై ఎర్రగొంగళి పురుగు, శనగపచ్చ పురుగులు ఆశిస్తాయని తెలిపారు.
- నులిపురుగులు ఉన్న ప్రాంతాల్లో టమాటా, బెండ, పెసర, మినుము పంటలు వేస్తే అవి వాటిని మరింత అభివృద్ధి చేస్తాయని అందుకు వాటిని పంట మార్పిడి చేయరాదని తెలిపారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- పంట మార్పిడిలో నేల ఉపరితలాన్ని పూర్తిగా కప్పే పంటలను రైతులు ఎంపిక చేసుకోవాలి. ఇందులో వేరుశనగ, బొబ్బెర, పెసర, మినుము పంటలను వేయడంతో నేలను పూర్తిగా కప్పి ఉంచటంతో కలుపు మొక్కలను నివారించవచ్చును.
- పప్పు దినుసుల పంటలను వేయడం వలన రైజోబియం బుడిపెలు ఏర్పడటంతో ఇవి గాలిలోని నత్రజనిని భూమిలో స్థిరీకరించి నేలను సారవంతంగా చేస్తాయని తెలిపారు. ఈ పప్పు దినుసుల పంటలను పచ్చిరొట్ట ఎరువుగా కూడా వాడుకోవచ్చు.
- పత్తి పంటను మినుము, పెసర వంటి పంటలతో మార్పిడి చేసుకోవటంతో తెల్లదోమ ఉధృతిని తగ్గించుకోవచ్చునని తెలిపారు.
- వేరుశనగ తర్వాత జొన్న, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు వంటి ఆరుతడి పంటలను పండించాలి. తద్వారా వేరుశనగ పంటను ఆశించే ఆకుముడత తెగుళ్ల ఉధృతిని తగ్గించవచ్చునని సూచించారు.
- పసుపు తర్వాత జొన్న, మొక్కజొన్న వంటి పంటలను సాగుచేసుకుంటే నేలలో నెమటోడ్ల సంఖ్య తగ్గుతుంది. వరిపంట తర్వాత పప్పు ధాన్యాల పంటలను కానీ, నూనెగింజల పంటలను కానీ పండించటం వలన వరిపంటను ఆశించే టుంగ్రోవైరస్, దోమపోటులను సమర్థవంతంగా నివారించవచ్చునని తెలిపారు.

రెండు పంటలు పండించాలి..



ప్రతీ రైతు ఏడాదిలో రెండు పంటలు పండించాలి. తెలికపాటి, ఎర్ర ఇసుక నేలల్లో మిశ్రమ పంటలను, వర్షాకాలంలో ఎక్కువ పంటకాలం కలిగిన కంది, వేరుశనగ పంటలను సాగు చేసుకోవాలి. బంకమన్ను శాతం ఎక్కువగా ఉండే ఎర్రనేలలు, నల్లరేగడి నేలల్లో, పల్లపు ప్రాంతాల్లో పంట మార్పిడి చేసి ఏడాదికి రెండు పంటలు పండిచుకోవాలి.

– సోములపల్లి మానస, ఏఓ, చింతకాని

మెగా జాబ్‌మేళాకు ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

వైరా: వైరాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సింగరేణి కాలరీస్ ఆధ్వర్యాన శనివారం నిర్వహించే మెగా జాబ్‌మేళాకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ ఆధ్వర్యాన జరిగే ఈ మేళాను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించనున్నారు. సుమారు 80 కంపెనీల బాధ్యులు హాజరుకానుండగా, నియోజకవర్గంలోని నిరుద్యోగులు పెద్దసంఖ్యలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే ఆధ్వర్యాన విస్తృత ప్రచారం చేయించడమే కాక ఎవరికీ ఇక్కట్లు ఎదురుకాకుండా ఏర్పాట్లు చేయిస్తున్నారు. అలాగే, జాబ్‌మేళా ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, అధికారులు పరిశీలించారు.

పాఠశాల ఏర్పాటు అభినందనీయం..

ఏన్కూరు: గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ విద్య నందించడానికి లిటిల్ ఫ్లవర్ పాఠశాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అన్నారు. ఏన్కూరులో నూతనంగా ఏర్పాటు చేసిన పాఠశాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్క నాటారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పోతినేని సాయి, డైరెక్టర్ డాక్టర్ పోతినేని భూమేష్‌రావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

ఎర్రుపాలెం: ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు వేసవి సెలవుల్లోనే చేపట్టాలి యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అనుమోలు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కేజీబీవీ పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శిక్షణ తరగతులు విద్యారంగ బలోపేతానికి కృషి చేస్తాయని, విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, మహిళా కార్యదర్శి పార్వతి, కోశాధికారి సైదారావు, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సాయం

బాల వేణుకు రూ.41వేలు..



నగదు అందిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి: మర్లపాడు గ్రామానికి చెందిన బాల వేణు ఎడమకాలు, ఎడమ చెయ్యి పడిపోవటంతో సర్జరీ కోసం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న యువ సేవాసమితి మర్లపాడు ఇన్‌చార్జ్ మందపాటి సాయి దాతల సహకారంతో రూ.41వేల నగదు సేకరించాడు. ఈ నగదును ఎమ్మెల్యే రాగమయి చేతుల మీదుగా బాధిత కుటుంబానికి శుక్రవారం అందించారు. కార్యక్రమంలో యువసేవ సమితి వ్యవస్థాపకులు జొన్నలగడ్డ రాజు, సత్తుపల్లి ఇన్‌చార్జ్ తన్నీరు మురళీ, రామకృష్ణ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.5వేలు..

కారేపల్లి: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కారేపల్లి గ్రామానికి చెందిన నిరుపేద గుర్రం వీరస్వామి కుటుంబానికి బీఆర్ఎస్ మైనార్టీ జిల్లా నాయకుడు షేక్ గౌసుద్దీన్ రూ.5వేలు ఆర్థిక సాయంతో పాటు, 50కేజీల బియం శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రవీందర్, జుంకీలాల్, ఖలీలుల్లాఖాన్, రామకృష్ణ, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మండలాల్లో మంత్రి పొంగులేటి పర్యటన



మధిర: వృద్ధురాలిని పలకరిస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

మధిర/ఎర్రుపాలెం/చింతకాని: మధిర పట్టణంతో పాటుగా ఎర్రుపాలెం, చింతకాని మండల కేంద్రాల్లో శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మధిర, ఎర్రుపాలెంలో నిర్వహించిన పలువురి వివాహ వేడుకలు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించగా.. చింతకానిలో మాత్రం పొంగులేటితో పాటు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నూతన వధూవరులను ఆశీర్వదించగా.. శ్రీనివాసరెడ్డి వారికి పట్టువస్త్రాలు అందించారు. అనంతరం మధిర ఓ వృద్ధురాలు అయ్య ఎలా ఉన్నావ్ అని పొంగులేటిని పలకరించగా పెద్దమ్మా బాగున్నాను అంటూ సమాదానమిచ్చారు. అనంతరం పార్టీ నాయకులను ఆత్మీయంగా పలకరించి కసేపు వారితో ముచ్చటించాడు. అనతరం పలు కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమాలల్లో డాక్టర్ కోట రాంబాబు, యన్నం కోటేశ్వరరావు, వేమిరెడ్డి లక్ష్మారెడ్డి, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

మధిర: ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతానికి అందరూ సహకరించాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు బండారు నాగరాజు కోరారు. మధిరలోని సీపీఎస్ పాఠశాలలో జరుగుతున్న శిక్షణ తరగతులను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. బోధనకు అంతరాయం రాకుండా సెలవుల్లో శిక్షణ ఏర్పాటుచేయడం అభినందనీయమని తెలిపారు. కాగా, ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని, సెలవుల్లోనే బదిలీలు, పదోన్నతులు నిర్వహించడమే కాక పెండింగ్ లో ఉన్న డీఏలను, పీఆర్సీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ నాయకులు చెన్నయ్య, మహేంద్రకుమార్, రమేష్ బాబు, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తూమును రెండు అడుగులకు పెంచాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

కల్లూరురూరల్: మండలంలోని లోకవరం పెద్ద చెరువుకు నాగార్జునసాగర్ కాలువ నుంచి నీటి సరఫరా చేస్తున్న తూమును రెండు అడుగుల స్థాయికి పెంచాలని కోరుతూ రైతులు ఎమ్మెల్యే రాగమయికి శుక్రవారం వినతిపత్రం అందించారు. ప్రస్తుతం ఉన్న తూము ఒక అడుగు మాత్రమే ఉండటంతో ఆయకట్టు పొలాలు ఎండుతున్నాయని, అదే రెండుఅడుగులకు పెంచితే భూములకు సరిపడా నీరు అందుతుందని రైతులు కల్యాణపు వెంకటేశ్వరరావు, కిష్టంశెట్టి కొండలు కోరారు.

సత్తుపల్లి ఐసీడీఎస్ సీడీపీఓగా మెహరున్నీసాబేగం



మాట్లాడుతున్న మెహరున్నీసాబేగం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓగా ఎస్‌కె మెహరున్నీసాబేగం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యాలయం సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది వెంకటేశ్వర్లు, ప్రసాద్, సూపర్‌వైజర్లు గంగాజలం, వసంతరాణి, భవాని, కమల, రమాదేవి, రజిని, సుజాత, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ ప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీపురమ్మతల్లి, శివలింగ ప్రతిష్ఠ



అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో పురాతనమైన పురమ్మతల్లి ఆలయ పునఃప్రతిష్ఠ, శివలింగ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాన్ని గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం సుప్రబాత సేవ, స్వామి మేలుకొలుపులు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.అష్టోత్తర కుంకుమ పూజా కార్యక్రమం నిర్వహించారు. రుద్రహోమం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

సామూహిక కుంకుమ పూజలు



కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని అయ్యగారిపేట శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో త్రిరాత్రి మహోత్సవాల సందర్భంగా శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అదే విధంగా శ్రీభక్తాంజనేయస్వామికి వాలాగ్రా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగళ్ల ప్రసాద్, బొంతు మాధవరావు, చల్లగుండ్ల కృష్ణయ్య, కృష్ణారావు, వల్లభనేని పవన్, కొప్పుల రజిని, రాజ్యం పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి తిరునాళ్లు



అమ్మవారి ఊరేగింపులో భక్తులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని గుడిపాడు కాలనీలో నాయకపోడు గిరిజనుల పెద్దమ్మతల్లి తిరునాళ్లను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అమ్మవారిని మేళతాళాలతో ఊరేగించారు. కార్యక్రమంలో మారుతిబాబురావు, పూడి గోవర్ధన్, భోగి వీరాస్వామి, భక్తులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల తోలకాలు ప్రారంభం



ఎరువుల తోలకాలు ప్రారంభించిన రైతులు

కల్లూరురూరల్: ఖరీఫ్ సీజన్ త్వరలో ప్రారంభం కానున్నందున రైతులు తమ పొలాల్లో సేంద్రియ ఎరువుల(పశువుల ఎరువులు)తోలకాలు ప్రారంభించారు. సాధారణంగా ప్రతి ఏడాది మే నెల చివరి వారంలో ఎరువుల తోలకాలు ప్రారంభించటం ఆనవాయితీ. ఈ మేరకు రైతులు తమ పొలాలు, చేలలో పశువుల ఎరువులను ట్రాక్టర్ల ద్వారా కుప్పలుగా వేసి ఆ తర్వాత ఆ భూమిని కలియదున్నుతారు. దీంతో భూసారం పెరగడంతో పాటు ఎరువుల వాడకం కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుంది. మండలంలోని బత్తులపల్లి, కప్పలబంధం, లింగాల, చంద్రుపట్ల, రఘునాగూడెం, ముచ్చవరం, విశ్వనాధపురం, చిన్నకోరుకొండి, పెద్దకోరుకొండి, తాళ్లూరు వెంకటాపురం, వెన్నవల్లి తదితర గ్రామాల్లో రైతులు సేంద్రియ ఎరువుల తోలకాలను ప్రారంభించారు.

కౌలు రైతులకు చట్టం తేవాలి



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

బోనకల్: కేరళ తరహాలోనే తెలంగాణ రాష్ట్రంలో కూడా కౌలు రైతుల గుర్తింపు చట్టం తీసుకురావాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీపురంలో నిర్వహించిన రైతు సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయలేదని, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ ఆచరణలో మాత్రం నెరవేరడం లేదన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి రమేష్, జిల్లా కోకన్వీనర్ ఉమ, సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు 'ఉపాధి'ని దూరం చేస్తున్న కేంద్రం



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కారేపల్లి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదలకు ఉపాధిహామీ పథకాన్ని దూరం చేస్తుందని వ్య.కా.సం జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మాణిక్యారంలో వ్యవసాయ కార్మిక సంఘం బృందం ఉపాధి పని ప్రదేశాలను సందర్శించి కూలీలతో మాట్లాడారు. ఉపాధి పథకంలో కొలతల విధానం, రెండు పూటల పని, పని ప్రదేశంలో ఫొటో దించటం వంటి కొత్త నిబంధనలతో పనుల పట్ల పేదలకు ఆసక్తి సన్నగిల్లుతుందన్నారు. పేదలకు 200దినాలు పని కల్పించి, రూ.600 వేతనం చెల్లించాలన్నారు. పని ప్రదేశాల్లో కనీస వసతులు కల్పించి, పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన అందరికీ ఇవ్వాలన్నారు. పేదల డిమాండ్లపై ఈ నెల 30న ఖమ్మం కలెక్టర్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని, కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యడ్లపల్లి సైదులు, డేగటి గోపాల్, పోతర్ల నాగేశ్వరరావు, వడ్డూరి వీరబాబు, పుల్లయ్య, సరస్వతి, లక్ష్మి, రాజు, మౌనిక, రమ్య, సాయమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ఫలితంగానే సంక్షేమ పథకాలు

కొణిజర్ల: కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా నాయకుడు బొంతు రాంబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని తనికెళ్లలో యాసా లక్ష్మి నర్సయ్య, పెద్దమళ్ల అప్పారావు వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించగా.. పలువురు పాల్గొని వారి సమాధి, చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, కృష్ణయ్య, యూటీఎఫ్ రంజాన్, చల్లానారాయణ, సూర్యం, ప్రభాకర్, వెంకయ్య, తిలక్, పాపిట్ల ప్రసాద్, పద్మినీ తిలకం, నరసింహారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ముదిగొండ: పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని టీడీపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం అన్నారు. శుక్రవారం ముదిగొండలో మండల కన్వీనర్ కనపర్తి వీరబాబు అధ్యక్షతన నిర్వహించిన టీడీపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలని కోరారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కనపర్తి వీరబాబు, ప్రధాన కార్యదర్శిగా సురేష్‌తో పాటు 8మంది కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు సత్యనారాయణ, గుర్రం సంగయ్య, బొడ్డు రామారావు, వడ్డెం రవి, మరికంటి లక్ష్మీనారాయణ, మంగయ్య, తదితరులు పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

చెత్త తొలగించరూ..



ముదిగొండ మండలంలోని వల్లబిలో ప్రజలు ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తున్నారు. ఇక చెక్‌పోస్టు, వైన్‌షాపుల వద్ద వేసిన చెత్త డంపిగ్ యార్డును తలపిస్తోంది. ఇది చూసిన వారంతా అసౌకర్యానికి గురవుతున్నారు. దీంతో దుర్గంధం వెదజల్లడంతో పాటు ప్రయాణ సమయంలో ఇబ్బందిగా ఉంటుందని అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్యకాలంలో చిరుజల్లులు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని, ఇకనైనా అధికారులు కల్పించుకోని పారిశుద్ధ్యంపై శ్రద్ధ వహించాలని ప్రజలు కోరుతున్నారు.

– ముదిగొండ

ప్రశ్నించాల్సిన అధికారి : ఎం.మురళి, పంచాయతీ కార్యదర్శి, వల్లబి
సెల్ నంబర్ : 8185969280